# ఫైనాన్స్ మాయాజాలం

"నమస్తే సార్."

"ఏం సాయన్నా, బాగున్నావా? చాలా రోజులయింది బ్యాంకుకు రాక!" బ్యాంక్ మేనేజర్ దినేష్ స్పందించాడు.

"బాగున్నా సార్, మీ దయతోటి."

"ఏం పని మీద వచ్చినవ్?"

"ఏదో చిన్న పని, ఒక మోటర్ సైకిల్‌కు లోను కావాల."

"మోటర్ సైకిలా? ఎవరికి? ఎందుకు?"

"వొల్లకేంటి సార్! నాకే. పొలాలూ, తోటనేమో దూరమాయె. సైకిలు తొక్కుడికి కాల్లన్ని గుంజుతున్నై, మోటర్ సైకిలుంటే మంచిగుంటది."

"మీకు బావుంటది కాని, మా రూల్స్ ఒప్పుకోవు. ఏదైనా ఉత్పత్తి కొరకు అప్పులివ్వగలం, కాని మోటర్ సైకిలు లాంటి విలాస వస్తువులకు కాదు."

"మోటరు సైకిలుంటే సవులత్ ఉంటది. యాడికి పోవాలన్నా జల్ది పోవచ్చు."

"అవును దాంతో పంట ఎక్కువ పండదు గాదా! అదే ట్రాక్టరు కొరకు లోను ఇస్తాం, మోటరు సైకిలు కొరకు ఇవ్వలేము.

"గదేంది సార్! ట్రాక్టరు కొరకు రెండు లక్షలిత్తరు గని, మోటర్ సైకిల్ కొరకు ముప్పై వేలియ్యరా?"

"ఇక్కడ ప్రశ్న లోను మొత్తం కాదు, లోను ఎందుకూ అని. ట్రాక్టరుతో దున్నడం సులువు. పంట ఎక్కువ పండించవచ్చు. బాడుగకు తిప్పినా అదనపు ఆదాయం వస్తుంది. పంటేగాని, గడ్డేగాని, ఫర్టిలైజర్లేకాని రవాణా చేయడానికి ఉపయోగపడుతుంది. దాంతో రవాణా ఖర్చులు దక్కుతాయి. అదే మోటరు సైకిలుకు పెట్రోలు ఖర్చే తప్ప, అదనపు ఆదాయం ఉండదు."

"మీ బ్యాంకోల్లతోని గిదే తిప్పలు. మా అవుసరంకు లోనియ్యరు గాని, పట్టెడు కానూన్లు సూపిత్తరు. అదే ఫైనాన్సోల్లయితే పొలం కాగితాలు పెట్టుకుని, దేనికంటే దానికి లోనిత్తరు."

"మాది గవర్నమెంటు బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీల్లా ప్రైవేటు కాదు. అన్నీ నియమాలకు లోబడే జరగాలి. ఫైనాన్స్ వారి వడ్డీ మాకంటే చాలా ఎక్కువ."

"ఎక్కువో తక్కువో, మా గరుజుకు బాకి దొరుకుతది గదా! మంచిది సార్, వస్త."

సాయన్న పడిగెల ఊరులో ఒక సన్నకారు రైతు. అతనికి రెండు అరకల పొలం ఉంది. అయిదెకరాల తోట ఉంది. తనకు ఏమాత్రం సరితూగని వారు, స్కూటర్లు, మోటరు సైకిళ్ళపై తిరుగుతుంటే, తను సైకిలుపై వెళ్ళడం నామోషీగా ఉంది. ఎలా అయినా మోటారు

సైకిలు కొనాలని అతని పట్టుదల. వారి ఊరి మహేష్‌కుమార్, ఆర్మూరులో ఓ ఫైనాన్స్ కంపెనీ పెట్టాడు. బ్యాంకు వారు మొండిచేయి చూపగానే సాయన్న "సత్వర ఫైనాన్స్" ఆర్మూరుకు చేరుకున్నాడు.

"నమస్తే సార్."

"నమస్తే, ఎటో దారి దప్పినవ్!" రివాల్వింగ్ చెయిర్‌లో హాయిగా కూర్చున్న మహేష్‌కుమార్, స్వాగతం పలికాడు.

"దారి దప్పిగాదు, దార్లకే వచ్చిన. ఒక మోటర్ సైకిల్ కావాలె."

"ఒకటిగాదు రెండు దీసుకో! మా కంపెనీ ఉన్నదే అందుకు. మరి ఎప్పుడు బ్యాంకుకు పోయేటోడివి మా దగ్గరికెట్లస్తివి?"

లోగడ పంపుసెట్టుకు లోనిస్తామన్నా, బ్యాంక్ నుంచి అప్పు తీసుకున్నాడు సాయన్న.

"బ్యాంకు గురించి మీకు తెలందేమున్నది? పన్నెండు ఫారాలు నింపాల, ఇరువైనాలుగు సంతకాలు జెయ్యాల. మల్ల గీదానికిస్తాం, గీదానికియ్యం అని నఖరాలు జేత్తరు."

సాయన్నతో వచ్చిన లింగయ్య అందుకున్నాడు. అతను ఈ ఫైనాన్స్ నుండే స్కూటరు తీసుకున్నాడు. ఆ స్కూటరుమీదే సాయన్నను తీసుకువచ్చాడు.

"సాయన్నసుంటోల్ల కియ్యకుంటే ఓల్లకిత్తం? మనిషిని జూడాల, నియతు మంచిగ లేకుంటే ఎన్ని కాగితాలు రాసుకుంటేమి? ఎంత జాయిజాత్ కుదువ పెట్టుకుంటేమి?"

"గందుకనే మీ దగ్గరికచ్చిన. హీరోహోండ ఇప్పియ్యుండ్రి."

"హీరోహోండా అంటే నలుపై వెయిలయితయి. మా దగ్గర పదివేలు రూపాయలు డిపాజిట్టు పెట్టాల, దానిమీద రూపాయి చొప్పున అడ్డి ఇస్తం."

"లోను మీద అడ్డి ఎంత గట్టాల?"

"రెండు రూపాల సొప్పున నెలకు ఎనిమిది నూర్లు, మూడేండ్లు కట్టాల."

"మరి అసలు?"

"దీలె (దీపావళి)కు ఏడువేలు, సంక్రాంతికి ఏడువేలు, ఇట్ల ఆరు కిస్తులు కట్టాల. లోను పూర్తిగ కట్టినంగ మీ డిపాజిటు మీకు అడ్డితోని ఇస్తం."

"అయితాయె ఒక ఫారం నింపుండ్రి."

"ఇగో గిట్ల పులి (× మార్కు) కొట్టిన జాగల సంతకం పెట్టి, లింగయ్యతోని జామీను సహి (సంతకం) పెట్టియ్యి. మా చార్జి రెండు వెయిల రూపాలు, పదివేలు డిపాజిటు, పొలం కాగితాలు తీసుకరండ్రి, వారం రోజుల్ల హీరోహండా అత్తది (వస్తుంది).

"అన్ని తీసుకునే అచ్చినం. యాడ సహి జెయ్యాల్నో సూపిత్తే ఊడనే అన్ని పూర్తి జేత్తం." పది రోజుల తర్వాత సాయన్న తన హీరోహోండా మీద ఆర్మూరు నుండి పడిగెల రాగలిగాడు. అదనపు చార్జీలు తీసుకుని ఫైనాన్స్ వారే డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్సు ఇప్పించారు.

సాయన్న ఆనందానికి అవధులు లేవు. లింగయ్య, మరో నలుగురు దగ్గరి స్నేహితులకు కల్లు, కోడితో పార్టీ అరేంజ్ చేశాడు.

ఒకనాడు పొద్దున, వండిన కోడిమాంసం తీసుకుని స్నేహితులు తాళ్ళల్లకు పోయారు. అప్పుడే చెట్టు నుంచి తీసిన కల్లు తాగుతూ పిచ్చాపాటీ మాట్లాడుతున్నారు.

"అట్టిట్ల మోటరు సైకిలు కొంటివి సాయన్నా! ఏదన్నా అనుకుంటివంటె సేసేదాక ఇడవు." గంగారాం సాయన్నని ఉబ్బించాడు. అతని కల్లు తాగుతున్నాడు మరి!

"అందరు మోటరు సైకిలు తీసుకుంటున్నరని మనం తీసుకుంటె ఎట్ల! తోటోడు తొడ కోసుకుంటున్నాడని మనం మెడ గోసుకుంటమా? బండి దీసుకునంగనే ఆయెనా, నెల నెలకు అడ్డి గట్టాల, ఆరారు నెల్లకు కిస్తులు గట్టాల, పెట్రోలు కర్సులు పెట్టాల. ఇల్లలుకంగనే పండుగాయెనా, ముందున్నది ముసుల్లపండుగ!' పార్టీ ఇస్తున్నాడని మొహమాటం లేకుండా, నిష్కర్షగా తన అభిప్రాయం వెలిబుచ్చాడు నర్సయ్య. అతని స్వభావమే అంత. తనకు అప్పుచేసి స్కూటరు కొనే ధైర్యం లేదుగాని సాయన్నపై ఒకింత అసూయగా ఉంది.

సాయన్న ఆ మాటలు పట్టించుకునే స్థితిలో లేడు. తన వాహనపు మత్తే కాక కల్లు మత్తు కూడా ఎక్కింది మరి! పార్టీ బాగా జరిగింది. రెండు వాహనాలపై ఆరుగురు స్నేహితులు ఊరికి తిరిగి వచ్చారు.

మర్నాడు ఉదయం సాయన్న తన భార్య, నాలుగేళ్ల నరేష్‌ను తీసుకుని తన అత్తగారి ఊరు మోర్తాడ్ బయలుదేరాడు.

తారు రోడ్డుపై వేగంగా దూసుకుపోతోంది హీరోహోండా. నాటి రాజులు తమ గుర్రాల మీద కూడా అంత ఠీవిగా కూర్చుని ఉండరు! ముందు కొడుకు, వెనకాల భార్య పంచకల్యాణి ఎక్కినంత సంబరంగా ఉంది అతనికి.

మోర్తాడ్‌కు డైరెక్ట్ బస్ లేకపోవడం వల్ల "గ్రామణి"లో వచ్చి గేటుపై దిగి వేరే బస్సు కొరకు పడిగాపులు పడవలసి వచ్చేది. ఆర్డినరీ బస్సులు తప్ప, ఎక్స్‌ప్రెస్‌లు పడిగెల రోడ్డుపై ఆపరు. వాటిల్లో రద్దీ, తొక్కిసలాట, ఇప్పుడా పాట్లన్నీ తప్పాయి. ప్రాణానికి హాయిగా ఉంది.

రోడ్డు కిరువైపులా చెట్లు, పంట పొలాలు. చల్లని ఎదురుగాలి, ఎంతో ఆహ్లాదం కల్గిస్తున్నాయి. ఈ దారిలో ఎన్నోసార్లు బస్సుల్లో పోయాడు. కాని ఇప్పుడు కలిగినంత ఆనందం ఎప్పుడూ కలుగలేదు.

తమ సొంత వాహనంపై వచ్చిన అల్లునికి, కూతురికి, మర్యాదలు ఇంకా బాగా జరిగాయి. తన బావమర్దులను, మరదండ్లను మోటారు సైకిలుపై తిప్పాడు సాయన్న. వారి సంతోషం అంతా ఇంతా కాదు.

వేసవి సెలవుల తర్వాత తిరిగి వచ్చిన హరినాథ్ మాష్టారుకు, మోటారు సైకిలు స్వాగతం పలికింది. ఆయన సాయన్న ఇంట్లో బాడుగకు ఉంటున్నాడు.

"నమస్తే సార్! ఇదేనా రాకడ?" సాయన్న పలకరించాడు.

"నమస్తే, ఈ మోటర్ సైకిలెవరిది?"

"మనదే సార్, నెలాయె తీస్కోని"

"మంచిదే, పని జోరుగున్నట్టుంది!"

"ఏదో మీ దయ. పొలం కాడికి పోతున్న, రాత్రికి మాట్లాడుదాం సార్."

రాత్రి భోజనాలయిన తర్వాత వాకిట్లో మంచం వేసుకున్నారు సాయన్న, మాష్టారు.

"సాయన్నా! నీకేమన్నా లాట్రి తగిలిందా బండి కొనుక్కున్నావు?"

"మా అసుంటోల్లకు లాట్రి లెక్కడ తగుల్తయ్ సార్! కష్టం జెయ్యాలె, కడుపు నింపుకోవాలె, ఫైనాన్స్‌ల లోను దీసుకున్న."

"ఫైనాన్స్ కంపెనీలో అంటే బాగా పిరెం పడుతది. దగ్గర దగ్గర రెండింతలు కట్టాలి."

"లేదు సార్, రెండే రూపాల అడ్డీ, ఎనిమిది దినాల్ల బండి ఇప్పిచ్చింద్రు. నాకైతే బాగ సవులత్ అనిపిచ్చింది."

"దీని ఖరీదెంత? మొదట ఎన్ని కట్టావు? వడ్డీ ఎంత కట్టాలి?

సాయన్న వివరాలు చెప్పాడు.

కామర్సులో పట్టభద్రుడేగాక, లెక్కల మాష్టారైన హరనాథ్ కాగితం తీసుకుని లెక్క కట్టాడు.

| | | |
|---|---|---|
| 1. | ఏడు వేల చొప్పున ఆరు వాయిదాలు | రూ॥ 42,000/- |
| 2. | నెలకు 800 చొప్పున 36 నెలల వడ్డీ | రూ॥ 28,800/- |
| 3. | ఫైనాన్స్ ఛార్జి | రూ॥ 2,000/- |
| 4. | డిపాజిట్టుపై కోల్పోయే వడ్డీ | రూ॥ 5,000/- |
| 5. | వాయిదాలపై కోల్పోయే వడ్డీ | రూ॥ 12,600/- |
| | రూ॥ | 90,400/- |

"చూశావా! నలభై వేల అప్పుకు ప్రత్యక్షంగా, అప్రయత్యక్షంగా రెట్టింపుకంటే ఎక్కువ కడుతున్నావు.

"గంత ఫరక్ ఎట్టుంటది సార్? రెండు రూపాల అడ్డి అంటే తక్కనేగదా!"

"నిజమే కాని వాస్తవానికి ఈ ఫైనాన్స్ వాళ్లు చాలా ఎక్కువ వడ్డీ రేడు తీసుకుంటున్నారు. నీవు ఇచ్చిన డిపాజిటుపై రూపాయి చొప్పున వడ్డీ ఇచ్చి, దానిపైనే నీనుండి రెండురూపాయల వడ్డీ వసూలు చేస్తున్నారు. నీ దగ్గర నెలనెలకు వడ్డీ వసూలు చేస్తూ చక్రవడ్డీ లాభం పొందుతున్నారు. నీకిచ్చెదేమో, మూడు సంవత్సరాల తర్వాత సాధారణ వడ్డీ! ఇంకా దారుణం ఏమంటే నీవు కట్టే వాయిదాలు అసలు నుండి మిహాయించక, అప్పు మొత్తంపై మూడు సంవత్సరాల వరకు చార్జి చేస్తున్నారు. బ్యాంకులో అలా చేయరు."

"గనన్ని మాకేం తెలుస్తయి సార్! బ్యాంకుల అడిగితే బాకియ్యక పోయిరి. బండి తీసుకోవాలని కాష్ ఉండే. ఫైనాన్సోల్లు అల్కగ ఎనిమిది దినాల్ల బండిప్పిచ్చిరి."

"నేను బ్యాంకు మేనేజరుతో మాట్లాడతాను. నీవు బాధపడకు. పొద్దుపోయింది పడుకో."

రెండు రోజుల తర్వాత, వీలు చూసుకుని, బ్యాంకు మేనేజరుతో చర్చించాడు

మాష్టారు. మారుతున్న కాలంతోపాటు బ్యాంకు నిబంధనలను కూడా మార్చాలని ప్రతిపాదించాడు. ఒకప్పుడు మోటర్ సైకిల్ విలాస వస్తువే కావచ్చు, కాని ఈ జెట్ ఏజ్‌లో కాదు. ఈరోజు అది అవసర వస్తువు. పొలాలు, తోటలు దూరంకదా! రూపాయల్లో వచ్చే లాభం మాత్రం కాక, ప్రజలకు అమరే సౌకర్యాలు వాటివల్ల వారికి కలిగే ఆనందం పరిగణించాలి. అందుకని తగినంత ఆదాయం ఉన్న రైతులకు వాహనాలకు కూడా అప్పివ్వాలని వాదించాడు. పేపర్‌వర్క్ తక్కువ చేసి సులభంగా, సత్వరంగా అప్పులు ఇచ్చే పథకాలు రూపొందించమని కోరాడు.

బ్యాంకు మానేజరు తాను చదివిన వ్యాసాలు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. బ్యాంకులు జాతీయం చేసినప్పటి ఉద్దేశ్యాలు మననం చేసుకున్నాడు. ప్రజలను వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాలనుండి రక్షించాలనే ప్రభుత్వ నీతిని గుర్తుకు తెచ్చుకున్నాడు. కల్లబొల్లి మాటలతో అరచేతిలో స్వర్గాన్ని చూపే "అభినవ వడ్డీ వ్యాపారస్తులైన" ఫైనాన్స్ కంపెనీల "మాయాజాలం" నుండి అమాయకులైన పల్లె ప్రజలను ఎలానైనా రక్షించాలనుకున్నాడు.

హరనాథ్ మాష్టారుతో సంప్రదించి ఒక నివేదిక తయారుచేశాడు. సాయన్న వంటి రైతులకు వారి ఋణం తీర్చే స్తోమతనుబట్టి వాహనాలకు, టి.వీ. టేపు వంటి మనోరంజక సాధనాలకు అప్పులు మంజూరు చేసే పథకాలు రూపొందించాడు. బ్యాంకు భద్రతకు భంగం వాటిల్లకుండా కనీస దస్తావేజులు, డాక్యుమెంట్లతో, సత్వరంగా ఋణాలు మంజూరు చేయడానికి తమ ప్రొసీజర్లలో మార్పులు సూచించాడు. అది తమ హెడ్డాఫీసుకు పంపించాడు.

దాదాపు మూడు నెలల తర్వాత బ్యాంకు మానేజరు దినేష్‌కు హెడ్డాఫీసు నుండి (అప్రిషియేషన్) లెటర్ వచ్చింది. అతడు రూపొందించిన పథకాలు, ఇచ్చిన సూచనలు కొన్ని మార్పుచేర్పులతో దేశం మొత్తంమీది బ్రాంచిలలో అమలుపరచినట్టు సర్క్యులర్ వచ్చింది. దినేష్ ఆనందానికి హద్దులు లేవు! అతను హరనాథ్ మాష్టారుకు ధన్యవాదాలు చెప్పాడు.

ఆ రోజు రాత్రి భోజనం తర్వాత మాష్టారు, సాయన్న పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.

"సాయన్నా నీ మోటారు సైకిలు కొరకు బ్యాంకులోను దొరుకుతుంది. అది బ్యాంకు వారు ఫైనాన్స్ కంపెనీకి డైరెక్టుగా కట్టి, వారి దగ్గర నీ పొలం కాగితాలు తీసుకుంటారు. రేపు బ్యాంకుకు వెళ్లి కావలసిన ఫారాలు నింపుదాం."

"ఏదో మీరు కావట్టి కోశీజ్ జేశి, మా అసుంటోల్లకు సాయం జేస్తున్నరు. ఇయ్యాల్లరేపు ఇంకొకరి కోసం కష్టపడేదెంతమంది? మీ మేలు జన్మలో మర్చిపోను."

"నాదేముంది? దినేష్‌గారు మంచివారు కాబట్టి ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని, మన అవసరాల కనుగుణంగా ఋణ పథకాలు రూపొందించారు. ఫైనాన్స్ కంపెనీల మాయాజల మర్మాలు తెలుసుకుని వాతపెట్టారు. దానివల్ల మీకు లాభం కలుగుతుంది."

"అది కూడా మీ చలవే" అన్నాడు సాయన్న.

మండలానికో హరనాథ్ మాష్టారూ, బ్యాంక్ మేనేజరు దినేష్ ఉంటే ఫైనాన్స్ మాయాజాలం, మాయంకాదూ?

(ఆంధ్రభూమి వీక్లీ 5 ఏప్రిల్ 1998)